## పోటీపరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తులు

సిటీబ్యూరో, జనవరి 15 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1, 2, 3, 4, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షలకు 4 నెలల ఉచిత శిక్షణకు మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా మైనార్టీ శాఖ అధికారి మహమ్మద్ ఇలియాజ్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. అబిడ్స్‌లోని జిల్లా మైనార్టీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

## చేనేత మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, జనవరి 15: చేనేత కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే జౌళి శాఖను విడదీసి చేనేతకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. 2024లో ఆర్థిక ఇబ్బందులకు తోడు ఉపాధి లభించక 27మంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు ఇప్పటికీ ప్రభుత్వ సాయం అందలేదన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయలని ఆయన డిమాండ్ చేశారు.

## బాపూజీనగర్‌లో అగ్నిప్రమాదం

కవాడిగూడ: ముషీరాబాద్ డివిజన్ పరిధిలోని బాపూజీనగర్‌లో మంగళవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బాపూజీ నగర్‌లో శ్రీకాంత్, నిఖిల దంపతులు నివాసం ఉంటున్నారు. సంక్రాంతి పండుగకు పూజ సామగ్రి కొనేందుకు భార్యా భర్తలిద్దరూ బయటకు వెళ్లారు. ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకోవడంతో ఇంట్లోని వస్తువులకూ వ్యాపించాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించి పైపుతో నీళ్లు చల్లి మంటలను ఆర్పారు. ప్రమాదంలో ఇంట్లోని వాషింగ్ మిషన్, కూలర్, టీవీ, ఫ్రిజ్, ఫ్యాన్స్, దుస్తులు నిత్యావసర వస్తువులు కాలి బూడిదయ్యాయి.

# వీడని జంట హత్యల మిస్టరీ

- అక్రమ సంబంధమే కారణమని అనుమానాలు
- మృతులను గుర్తించిన పోలీసులు
- పోలీసుల అదుపులో అనుమానితులు



మృతి చెందిన సాకేత్, బిందు (ఫైల్)

సిటీబ్యూరో, జనవరి 15 (నమస్తే తెలంగాణ): నార్సింగి ఠాణా పరిధిలో కలకలం సృష్టించిన జంట హత్యల కేసు మిస్టరీగా మారింది. ప్రస్తుతం మృతులను గుర్తించిన పోలీసులు హత్యకు గల కారణాలను, హంతకుల కోసం అన్వేషిస్తున్నారు. అయితే అక్రమ సంబంధమే హత్యకు కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ కథనం ప్రకారం.. ఈనెల 14న సంక్రాతి పండుగ సందర్భంగా స్థానిక యువకులు గాలిపటాలను ఎగురవేసేందుకు పుప్పాల్‌గూడ అనంత పద్మనాభస్వామి ఆలయం గుట్టపైకి వెళ్లారు. కాగా అక్కడ ఒక వ్యక్తి మృతదేహం పడివుంది. ఇది గమనించిన వారు వెంటనే 100 నంబర్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు పరిసర ప్రాంతాలను పరిశీలించగా వ్యక్తి మృతదేహానికి కొద్ది దూరంలో ఒక మహిళ మృతదేహం కూడా పడి ఉన్నట్లు గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు బండరాళ్లతో మోది కిరాతకంగా హత్యచేసినట్లు గుర్తించిన పోలీసులు క్లూస్‌టీమ్, జాగిలాలను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతిచెందిన వ్యక్తి మధ్యప్రదేశ్‌కు చెందిన అంకిత్ సాకేత్(25), మృతురాలు ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన బిందు(25)గా పోలీసులు గుర్తించారు. అయితే బిందుకు వివాహమై ముగ్గురు పిల్లలు ఉన్నారని, ఎల్బీనగర్‌లో నివాసం ఉంటున్నట్లు గుర్తించారు.

ఈనెల 3న బిందు కనిపించకపోవడంతో ఆమె భర్త వనస్థలిపురం పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో అక్కడ మిస్సింగ్ కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. కాగా అంకిత్ సాకేత్ నానక్‌రామ్‌గూడలో నివాసముంటూ హౌస్ కీపింగ్ పనిచేస్తున్నట్లు తెలిసింది. బిందు, అంకిత్ మధ్య వివాహేతర సంబంధం ఉందని, ఈ క్రమంలోనే ఈనెల 8న అంకిత్ ఎల్బీనగర్ నుంచి బిందును నానక్‌రామ్‌గూడకు తీసుకువచ్చి, స్నేహితుల రూమ్‌లో ఉంచినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఈనెల 11న రాత్రి వీరిని గుర్తుతెలియని వ్యక్తులు హత్యచేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అయితే హత్య చేశారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని చెబుతున్నారు. దర్యాప్తులో భాగంగా అంకిత్ స్నేహితుల్లో కొందరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

## మాజీ ఫ్లోర్‌లీడర్ గోపాల్‌రావు సేవలు చిరస్మరణీయం


గోపాల్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏకే ట్రస్ట్ భవన్ సభ్యులు

కాచిగూడ, జనవరి 15: జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్, నింబోలి అడ్డా మాజీ కార్పొరేటర్, 1969 తెలంగాణ విద్యార్థి జేఏసీ కన్వీనర్ ఎస్.గోపాల్‌రావు సేవలు చిరస్మరణీయమని పలువురు అన్నారు. ఏకే ట్రస్ట్ భవన్ నింబోలిఅడ్డా ఆధ్వర్యంలో ఏకే భవన్‌లో ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. కేసీఆర్ ఇచ్చిన స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగాలకు వెనకడుగు వేయకుండా ఉద్యమంలో పాల్గొన్న వ్యక్తి గోపాల్‌రావు అని, ప్రత్యేక తెలంగాణ కోసం అనేక మార్లు జైలుకెళ్లిన నేత అని వారు పేర్కొన్నారు. అంతేగాకుండా తెలంగాణ ఆరేకటిక (సూర్యవంశ) సంఘం అధ్యక్షుడిగా, ఏకే భవన్ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ సుభాశ్‌చందర్‌జీ, గోపాల్‌రావు కుటుంబసభ్యులతో పాటు హెచ్.రమేశ్ కుమార్, కె.సూర్యప్రకాశ్, జ్ఞానేందర్, హరినారయణ్, రఘునాథ్, నందకిశోర్ యాదవ్, బి.కృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రేషన్‌కార్డుదారుల ఎంపిక

సిటీబ్యూరో, జనవరి 15: (నమస్తే తెలంగాణ): నేటి నుంచి హైదరాబాద్‌లో కొత్తగా ఆహార భద్రత కార్డుల(రేషన్) జారీ ప్రక్రియకు లబ్దిదారుల దరఖాస్తులపై సర్వే ప్రారంభమవుతుంది. కులగణన సర్వే దరఖాస్తుల ఆధారంగా రేషన్‌కార్డులు లేని కుటుంబాల జాబితాను తయారు చేశారు. ఈ జాబితా జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ప్రభుత్వం పంపించింది. ఇందులో అర్హులైన వారిని గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారు. జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు పరిశీలనలో పాల్గొంటారు. హైదరాబాద్‌లో ఇప్పటికే 6.39 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి.

## ముదిరాజ్ మహాసభ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కాసాని జ్ఞానేశ్వర్, తదితరులు

బన్సీలాల్‌పేట్, జనవరి 15: ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ విడుదల చేశారు. ముదిరాజ్ కుల దైవం పెద్దమ్మ తల్లి ఫొటోతో క్యాలెండర్‌ను తయారు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. ముదిరాజ్ మహాసభ నాయకులు సదానంద్, నారాయణ, రాములు, రాజారామ్, వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కుటుంబ సర్వే నివేదికను తెలియజేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్ పటేల్‌గౌడ్, తదితరులు

కాచిగూడ, జనవరి 15: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వే నివేదికను తక్షణమే ప్రజలకు తెలియజేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం నింబోలిఅడ్డా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం నిర్వహించిన కుటుంబ సర్వే ఆధారంగా బీసీ కులాల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను వెంటనే ఖరారు చేసి 42 శాతం వరకు పెంచాలని సీఎంను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పులిజాల కృష్ణ, ముత్యాల్‌రావు, డాక్టర్ ప్రశాంత్‌నిమ్‌కర్, భాస్కర్, ప్రదీప్ గౌడ్, కిశోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## • తాగునీరు.. రోడ్డుపాలు



**మెహిదీపట్నం: కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్ అంబేద్కర్‌నగర్ వద్ద ప్రధాన రోడ్డుపై పైప్‌లైన్ పగిలి తాగునీరు మ్యాన్‌హోల్ నుంచి రోడ్డుపై ప్రవహిస్తున్నది. గండుపోచమ్మ ఆలయం వద్ద రోడ్డుపై తాగునీరు ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.**

## ఇండేన్ కస్టమర్లకు డ్రా.. వెండి నాణేల అందజేత




నేరేడ్‌మెట్, జనవరి 15: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తమ ఇండేన్ కస్టమర్లను ప్రోత్సహించడం కోసం తలపెట్టిన 25 గ్రాముల సిల్వర్ కాయిన్ డ్రా కార్యక్రమాన్ని సనత్‌నగర్‌లోని ఐఓసీఎల్ కేంద్ర కార్యాలయంలో తెలంగాణ- ఆంధ్రప్రదేశ్ ఎల్పీజీ హెడ్ సితేష్ కిషన్ ఆధ్వర్యంలో అవగాహన, డ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐఓసీఎల్ టప్సో తెలంగాణ- ఏపీ జీఎం యోగా రాణి సురేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ వ్యాప్తంగా 250 ఇండేన్ డీలర్ల పరిధిలో జూమ్ పద్ధతితో డ్రా నిర్వహించి ఎంపికైన కస్టమర్లకు 25 గ్రాముల వెండి నాణేలను సంక్రాంతి కానుకగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఇండేన్ డివిజన్ సిబ్బంది కీర్తి, సోనాసాహు, సుబ్బారావు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో మ్యాన్‌హోల్.. పొంగుతున్న డ్రైనేజీ



బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1లో ప్రధాన రహదారిపై మ్యాన్‌హోల్ శిథిలావస్థలో ఉన్నది. పెన్షన్ ఆఫీసు చౌరస్తాకు వెళ్లే రహదారిలో రోడ్డుపై మ్యాన్‌హోల్ నుంచి డ్రైనేజీ నీరు ఉబికి వస్తూ పక్కనే ఉన్న ప్రేమ్‌నగర్‌కాలనీలోకి ప్రవహిస్తున్నది. ఫలితంగా కాలనీ వాసులు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జలమండలి అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌ను సరిచేయాలని కోరుతున్నారు. - ఖైరతాబాద్

## దుకాణదారులకు షాపులు కేటాయించాలి



అబిడ్స్/మెహిదీపట్నం, జనవరి 15 : బేగంబజార్ చేపల మార్కెట్‌లో ఉన్న దుకాణదారులకు షాపులను కేటాయించాలని కార్వాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొహినుద్దీన్, ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్ ఖాద్రి బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కోరారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని ఆయన కార్యాలయంలో కలిసి చేపల మార్కెట్ సమస్యపై చర్చించారు. చేపల మార్కెట్‌లో వ్యాపారాలు చేసుకుంటున్నవారికి దుకాణాలను కేటాయించాలని అన్నారు.

## వైభవంగా యువ సంకీర్తనోత్సవం



సిటీబ్యూరో, జనవరి 15 (నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్‌లో 15 రోజుల పాటు జరిగిన యువ సంకీర్తనోత్సవం వైభవంగా ముగిసింది. సంప్రదాయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్సవం జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ సంగీత కళాకారులు తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. యువ కర్ణాటిక్ సంగీత కళకారులను ప్రోత్సహించడంలో భాగంగా జరిగిన ఈ కాన్సర్ట్ ఆద్యంతం మంత్ర ముగ్ధుల్ని చేసింది. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి గల అంశాలను హోప్‌ఏడ్ టీవీ డైరెక్టర్స్ కేఎస్ రావు, కె.సునీత వివరించారు. అనంతరం ఉత్సవంలో పాల్గొన్న కళాకారులను సత్కరించారు.

# రేపటి నుంచి చిత్తారమ్మ జాతర

- స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు


గాజులరామారంలోని చిత్తారమ్మ ఆలయం, ఇన్‌సెట్‌లో కొలువుదీరిన చిత్తారమ్మదేవి

దుండిగల్, జనవరి 15: కొలిచే భక్తులకు కొంగుబంగారం, గాజులరామారంలో వెలిసిన చిత్తారమ్మదేవి జాతర ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఆలయం నిర్మించి 50 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈసారి అమ్మవారి బ్రహ్మోత్సవాల (జాతర)ను స్వర్ణోత్సవాల పేరిట మరింత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ మహానగరంతోపాటు నగరశివారు ప్రాంతాలు, జిల్లాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో వేడుకల్లో పాల్గొననున్నారు. ప్రధాన జాతర ఈనెల 19న (ఆదివారం) జరగనుండగా లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకునే అవకాశం ఉన్నది.

## రోడ్డు ప్రమాదంలో విలేకరికి తీవ్రగాయాలు

వెంగళరావునగర్, జనవరి 15: మద్యం మత్తు.. ఆపై అతివేగం.. ట్రిపుల్ రైడింగ్‌తో ఆకతాయిలు బైక్‌తో ఢీకొట్టడంతో సీనియర్ విలేకరి రమేశ్ (56) తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం అమీర్‌పేటలోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్నారు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన వివరాలు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం ప్రకారం.. గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన రమేశ్ ఓ దినపత్రికలో స్థానిక విలేకరిగా పనిచేస్తున్నారు. సంక్రాంతి పండుగ కావడంతో సాయంత్రం తన మేనల్లుడితో కలిసి డ్రై ఫ్రూట్స్ కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంపై ఎస్‌ఆర్‌నగర్ వచ్చాడు. కమ్యూనిటీహాల్ సమీపంలోని ఓ హోటల్ వద్దకు రాగానే వెనుక నుంచి ముగ్గురు కలిసి ఒకే బైక్ పై మితిమీరిన వేగంతో వచ్చి రమేశ్ నడుపుతున్న బైక్‌ను ఢీకొట్టారు. కిందపడిపోయిన రమేశ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. స్థానికులు వెంటనే అతడిని అమీర్‌పేటలోని ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. ప్రమాదానికి కారణమైన యువకులు ఆగకుండా బల్కంపేట వైపు వెళ్లిపోయారు. రమేశ్ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను గుర్తించేందుకు సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

## 5 తులాల బంగారు నగలు తస్కరణ

పీర్జాదిగూడ, జనవరి 15: ఊరికి వెళ్లి వచ్చేసరికి వరుసగా రెండు ఇళ్లలో తాళాలు పగలగొట్టి బంగారు నగలు చోరీ చేసిన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి తిరుమల మెడోస్ గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో ఉంటున్న మహ్మద్ అజీద్, కూరెళ్ల ప్రతాప్ ప్రైవేటు ఉద్యోగులు. మూడు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లారు. తిరిగి మంగళవారం వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి కనిపించింది. లోపల వెళ్లి చూడగా ఇద్దరి ఇళ్లలో కలిపి 5 తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు తెలుసుకున్న బాధితులు బుధవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# రాత్రయ్యిందంటే మురుగు వరద

- ఎర్రమంజిల్ బస్టాండ్ నుంచి రాజ్‌భవన్ క్వార్టర్స్ వరకు పారుతున్న మురుగు నీరు


ఎర్రమంజిల్ బస్టాప్ ఎదుట మ్యాన్‌హోల్ నుంచి పొంగిపొర్లుతున్న మురుగు

ఖైరతాబాద్, జనవరి 15: రాత్రయ్యిందంటే చాలు పంజాగుట్ట, ఖైరతాబాద్‌కు వెళ్లే రహదారులు మురుగు నీటితో జలమయమవుతున్నాయి. ఖైరతాబాద్ వైపునకు వెళ్లే రోడ్డులో ఉన్న ఎర్రమంజిల్ బస్టాప్ ఎదురుగా నెల రోజులుగా మ్యాన్‌హోల్ నుంచి గ్యాలెన్ల కొద్దీ నీరు ప్రవహిస్తున్నది. రాత్రి 10 గంటలకు ప్రారంభయ్యే మురుగు వరద తెల్లవారు జాము వరకూ కొనసాగుతున్నది. సుమారు అర కిలోమీటరు మేర మురుగు నీరు ప్రవహిస్తూ రాజ్‌భవన్ క్వార్టర్స్, సంస్కృతి భవన్ మీదుగా నర్సింగ్ కళాశాల చౌరస్తా వరకు సాగుతున్నది. పెద్ద ఎత్తున రోడ్డుపై నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ మురుగు రోడ్డుపై ప్రవహిస్తున్నా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మురుగు నీటి ప్రవాహానికి అడ్డుకట్టు వేయాలని వారు కోరుతున్నారు.



రాజ్‌భవన్ క్వార్టర్స్ రోడ్డులో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

# ఉత్సాహంగా.. కైట్ ఫెస్టివల్



సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో జరుగుతున్న కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ ఉత్సాహంగా జరిగింది. నగరం నలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







## 17న కాచిగూడలో బీసీ మేధావుల సదస్సు

కాచిగూడ, జనవరి 15: తెలంగాణలో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల గణన సర్వేను వంద శాతం పూర్తి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ బీసీల జనాభా దమాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఈనెల 17న ఉదయం 10 గంటలకు కాచిగూడ అభినందన్ హోటల్‌లో బీసీ మేధావుల సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యతో పాటు మేధావులు, అఖిల పక్ష ప్రజాప్రతినిధులు, ఉద్యోగ,ఉపాధ్యాయ, న్యాయవాదులు, డాక్టర్లు, వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, కుల సంఘాలు, మహిళా, యువజన, విద్యార్థి నేతలు పాల్గొంటారని చెప్పారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ,జనవరి 15: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ సుబ్బారావు కథనం ప్రకారం వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(35) బుధవారం ఉప్పుగూడ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై నీలి రంగు చొక్కా,నీలి రంగు ప్యాంట్ ధరించి,ఎత్తు 5.5 ఉన్నటు తెలిపారు. మృతుని వివరాల కోసం 9494824535 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## మరో ఘటనలో వృద్ధుడు..

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా వడ్డేపల్లి ప్రాంతానికి చెందిన అలకుంట సాయిలు(68)మంగళవారం రాత్రి బుద్వేల్-ఉందానగర్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతోఆ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పోలీసులు మృతదేహన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.